క్లుప్తంగా

'ఖని' విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న విద్యార్థినులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థినులు టేకు రజిత అకౌంటెన్సీ అండ్ టాక్సేషన్ గ్రూపులో 1000కి గాను 989మార్కులు, కన్నూరి రాజ్యలక్ష్మి సీజీఏ గ్రూపులో 500లకు గాను 496 మార్కులు సాధించారు. కాగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్స్, రూ10వేల నగదు పురస్కారాలను అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అంజయ్య, అధ్యాపకులు ఆర్.రఘు, పి.లలిత పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న బోనాలు



బోనాలతో మహిళలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని గోకుల్ నగర్‌లో కురుమ కులస్తులు బీరన్న బోనాల వేడకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో బీరన్న ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు.

పెద్దమ్మతల్లికి బోనాలు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

జూలపల్లి: మండల కేంద్రంలో ముదిరాజుల కుల దైవం పెద్దమ్మ బోనాలను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పెద్దమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. బీజేపీ సీనియర్ నాయకులు కందుల సదానందం, అమరగాని ప్రదీప్ కుమార్‌గౌడ్, ముదిరాజ్ కులస్తులు చొప్పరి రవి, కూసి రాజయ్య, కూసి కొముర‌య్య, చొప్పరి నర్సయ్య, సంతోష్, కూసి మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్



క్యాంపును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కమాన్‌పూర్(రామగిరి): మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో భాగంగా రామగిరి మండలం పన్నూర్‌లో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముందుగా మెడికల్ క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, సర్పంచ్ అల్లం పద్మతో కలిసి ప్రారంభించారు. వైద్య శిబిరంలో బేగంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందంతో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. ప్రోగాం అధికారి దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు రాజగోపాల్, ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

గోదావరిఖని: ఈనెలఖారున ఉద్యోగ విరమణ పొందుతున్న ఓసీపీల జీఎం వై.గోపాలకృష్ణ మూర్తిని గురువారం ఘనంగా సన్మానించారు. ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో గోపాలకృష్ణ మూర్తిని జీఎం మనోహర్ శాలువాలతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్య తీసుకోండి

మంథని: మండలంలోని సూరయ్యపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం బుక్‌స్టాల్ యజమానితో కుమ్మక్కై పాఠశాల ఎదురుగా దుకాణం తెరిచి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. విద్యార్థులకు బలవంతంగా పుస్తకాలు అంటగడుతున్నారని, తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కాగా ఈ విషయంపై ప్రజా సంఘాల నాయకులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేరు. దీంతో గేటుకు వినతి పత్రం సమర్పించారు. విద్యాధికారి పాఠశాలలను సందర్శించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కదారి సతీశ్ కోరారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



పెద్దపల్లిరూరల్: హన్మంతునిపేటలో కొవ్వొత్తులతో నివాళి



సుల్తానాబాద్: నివాళి అర్పిస్తున్న సూర శ్యామ్



కాల్వశ్రీరాంపూర్‌లో..



రామగుండం: నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



ధర్మారం: ఉద్యమకారులకు సన్మానం



కమాన్‌పూర్: ఎంపీడీవో కార్యాలయంలో..



సుల్తానాబాద్‌రూరల్: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ



జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో..



ఓదెల: మౌనం పాటిస్తున్న ఎంపీపీ



ఎలిగేడు: సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



యైటింక్లయిన్‌కాలనీ: ముస్త్యాలలో..

సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్/రామగుండం/జూలపల్లి/కమాన్‌పూర్(రామగిరి)/ధర్మారం/కాల్వశ్రీరాంపూర్:ఓదెల/యైటింక్లయిన్‌కాలనీ/కమాన్‌పూర్/ఎలిగేడు: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలు వెలకట్టలేనివని ప్రజాప్రతినిధులు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో అమరవీరుల స్తూపం, చిత్రపటాలకు నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచుల అధ్యక్షతన సమావేశాలు ఏర్పాటు చేసి అమర వీరులకు నివాళి అర్పించారు.ఉద్యమంలో చురుగ్గా పాల్గొని జైలు పాలైన వారందిరినీ సన్మానించారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి



మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన కోసం పౌరులందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద ఏర్పాటు చేసే అమరవీరుల స్తూపానికి గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం ఆయన అమరవీరుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు జ్ఞానేశ్వరి, గొట్టం లక్ష్మి, మమత, గోపి, గుర్రాల శ్రీనివాస్, తిరుపతి, సాజిత్, పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, గొట్టం మహేశ్, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేంచందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, ముత్యం రమేశ్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి, మద్యానికి యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ జగదీష్

సుల్తానాబాద్‌రూరల్: యువత గంజాయి, మద్యం మత్తుకు దూరంగా ఉండాలని సీఐ జగదీష్ సూచించారు. సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామంలో గురువారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలపాలకు పాల్పడి జీవితాన్ని నశనం చేసుకుంటున్నారని, అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రస్తుతం సైబర్ క్రైం, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఇలాంటి నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనే ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని కోరారు. ఎస్సై విజేందర్, నాయకులు కర్క శంకర్, రాంరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



గోదావరిఖని: దిష్టిబొమ్మ దహనం

కమాన్‌పూర్(రామగిరి): దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనం వృథా చేసినందుకు కాంగ్రెస్ రామగిరి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందించారు.

గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో స్థానిక జీఎం ఆఫీస్ క్రాసింగ్ వద్ద గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

మంథని: మంథనిలో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

కాల్వశ్రీరాంపూర్: దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ గురువారం కాల్వశ్రీరాంపూర్‌లో కాంగ్రెస్ నేతృత్వంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు.

ఓదెల: మండలంలోని గుంపులలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

జూలపల్లి: మార్కెట్ యార్డు చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు అబూబకర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎలిగేడు: ఎలిగేడు మండలంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

ప్రభాకర్‌రెడ్డి విగ్రహావిష్కరణ



నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని: ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో మాజీ సర్పంచ్ దివంగత పోతిపెద్ది ప్రభాకర్‌రెడ్డి విగ్రహాన్ని గురువారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆవిష్కరించారు. సర్పంచ్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పెద్దపల్లి, మంథని మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, చంద్రుపట్ల రాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, సర్పంచ్ బక్కారావు ఉన్నారు.

అంబేడ్కర్ చెరువు పనుల పరిశీలన

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ చెరువు ఆధునీకరణ పనులను గురువారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరిశీలించారు. అంబేడ్కర్ చెరువు ఆధునీకరణతో కొత్త శోభ సంతరించుకుంటోందన్నారు. బన్ని చెరువు నుంచి పైపులైన్ ద్వారా అంబేడ్కర్ చెరువులోకి నీటిని తరలించినట్లు తెలిపారు. పట్టణంలోని రావుల, తమ్మి చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

మురుగునీటి కాలువ సమస్య పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కోల్‌సిటీ: గోదావరిఖని రాజీవ్‌నగర్‌లో మురుగు నీటి కాలువ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కాలనీవాసులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 38, 46వ డివిజన్ల మధ్యలో 50ఏళ్ల క్రితం నుంచి ఉన్న కాలువకు అడ్డంగా, కొందరు మట్టిపోసి పూడ్చివేయడంతో సమస్య ఏర్పడిందన్నారు. దీంతో మురుగునీరు బయటకు పోవడానికి మార్గం లేక సమీపంలోని ఇళ్లలోకి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుక్కడపు మురళి, ఇందారపు అంజయ్య, కోటయ్య పాల్గొన్నారు.

సివిల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 పరిధిలో సివిల్ పనులను త్వరిగతిన పూర్తి చేయాలని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో గురువారం సివిల్ డిపార్ట్ పనులపై సివిల్, ఇతర అధికారులతో సమీక్షించారు. గనులు, కాలనీలు, ఆర్‌అండ్‌ఆర్‌లో చేపట్టిన పనుల వివరాలు, పనుల పురోగతిని తెలుకున్నారు. అధికారులు ఎలిషా, శ్రీనివాసులు, రమేష్, కాశీవిశ్వేరరావు, చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, పద్మరాజు, ఐలయ్యలతో పాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో స్వచ్ఛపక్వాడా

గోదావరిఖని: స్వచ్ఛపక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్జీ–2 ఏరియా సెక్టార్–3 డిస్పెన్సరీలో చెత్తను అధికారులు శుభ్రం చేశారు. ఎస్‌ఓటూ జీఎం రవీందర్, యూనియన్ నాయకులు శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటా ప్రచారం



కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేటలో సురేశ్‌రెడ్డి



జ్యోతినగర్: కార్యక్రమంలో అరుణ్‌కుమార్

గోదావరిఖని: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ నాయకుడు వివేక్, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ కోరారు. స్థానిక రాంనగర్‌లో మహాజన్‌సంపర్క్ అభియాన్ నిర్వహించారు.

కమాన్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పరిపాలనలో ప్రవేశపెట్టిన పథకాలపై బీజేపీ నాయకులు మండల కేంద్రం, గుండారం, జూలపల్లి, గొల్లపల్లి, నాగారం, రొంపికుంట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేట గ్రామంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేశ్ రెడ్డి గురువారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు.

మంథని: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం పట్టణంలోని ముత్యాలమ్మవాడలో ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించారు.

ఫెర్టిలైజర్‌సిటీ: బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి అంశాలపై కరపత్రాలను గురువారం రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమీనగర్‌లో బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ఇంటింటా పంపిణీ చేశారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం చీకురాయిలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

జ్యోతినగర్: మల్కాపూర్ మండలం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీ మూడో డివిజన్‌లోని 49వ బూత్ అధ్యక్షుడు ఈదునూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని నాలుగు బూత్‌లలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు గురువారం ప్రచారం నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్ల అవినీతిపై విచారణ జరపండి

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు వస్తే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడ్డారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రవీందర్ ఆరోపించారు. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్, రెబ్బల్‌దేవ్‌పల్లి కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణను కలిసి కోరామని పేర్కొన్నారు. ప్రశాంత్, శ్రీకాంత్ ఉన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎండీ రమాదేవి

ధర్మారం: ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ధర్మారం మండల కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులకు ఎంపికయ్యారు. ధర్మారంలోని సాయి మణికంఠ హైస్కూల్‌కు చెందిన పత్తిపాక యశస్వి, పాత అరుణిమ, బొడ్డు కార్తీక్ ఎంపికైనట్లు విద్యాలయం కరస్పాండెంట్ జైన సురేశ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల మెనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, కరస్పాండెంట్ సురేష్‌కుమార్ అభినందించారు.

బ్రిలియంట్ విద్యార్థి..

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన ఎండీ అహ్మద్, జరీనా దంపతుల కూతురు ఇఫాత్ స్థానిక బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతోంది. చొప్పదండి నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో సీటు సాధించింది. ఇఫాత్‌ను మండల విద్యాధికారి కవిత, పాఠశాల కరస్పాండెంటు కొండ సత్యం ,ఉపాధ్యాయులు అభినందించారు.

కంఫర్ట్ పాఠశాల విద్యార్థి..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ పాఠశాలలో చదువుతున్న సానమల్ల వర్షిత్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ఆరో తరగతిలో సీటు సాధించాడు. తహసీల్దార్ దత్తు ప్రసాద రావు, పాఠశాల కరస్పాండెంట్ ఆర్నకొండ వినయ్, సౌమ్య విద్యార్థిని అభినందించారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

గోదావరిఖనిటౌన్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, బోడుప్పల్‌లో 26, 27, 28 తేదీల్లో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణా తరగతులను విద్యార్థి లోకం విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం కోరారు. స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఎస్పీకి ప్రజాదరణ పెరుగుతోంది



విరాళాలు సేకరిస్తున్న దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్: బీఎస్పీకి ప్రజాదరణ పెరుగుతోందని ఆ పార్టీ పెద్దపల్లి నియోజకర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని మీర్జంపేట గ్రామంలో గురువారం 'మన ఊరు మన ఉషక్క' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ ప్రయోజనాల కోసం విరాళాలు సేకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజాధనాన్ని వృథా చేస్తోందని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన పత్రికలు, జర్నలిస్టులను విస్మరించడం శోచనీయమని, జర్నలిస్టుల కాలనీల నిర్మాణం ఊసేలేదని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి హనుమయ్య, మండల అధ్యక్షుడు రవికుమార్, మహిళా అధ్యక్షురాలు శారద, నాయకులు రియాజ్, కిరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోండి

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలంలో జూన్ 18 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని తహసీల్దార్‌తో డిజిటల్ సంతకం చేసుకున్న వారు, ఇంత వరకు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోని వారు ఏఈవోల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మోహన్ గురువారం తెలిపారు.

✦ మంథని తహసీల్దార్ కలెక్టరేట్‌కు బదిలీ

మంథని: మంథని తహసీల్దార్ బండి ప్రకాష్ కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ సంగీత సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మంథని డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న గిరికి ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) అప్పగించారు.

✦ పాలకుర్తి తహసీల్దార్..

పాలకుర్తి: పాలకుర్తి మండల తహసీల్దార్ జె.సునీతను గురువారం బదిలీ చేస్తూ కలెక్టర్ సంగీత ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉమాశంకర్‌ను పాలకుర్తి తహసీల్దార్‌గా నియమిస్తూ సునీతను కలెక్టరేట్‌లోని పరిపాలనా విభాగానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

✦ ఒకరిపై కేసు నమోదు

కమాన్‌పూర్(రామగిరి): మహిళను దూషించిన కేసులో సెంటినరీకాలనీకి చెందిన తోట చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు రామగిరి ఎస్సై రవి ప్రసాద్ తెలిపారు. మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళను డబ్బుల విషయంలో చంద్రయ్య మహిళను దూషించిన వీడియో సోషల్ మీడియాల్లో వైరల్‌గా మారింది. సదరు మహిళ తనను దూషించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్ల ఎస్సై పేర్కొన్నారు.

✦ విద్యార్థికి సన్మానం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు రేవెల్లి తరుణ్ ఆల్ ఇండియా ఐఐటీ ఎస్టీ కేటగిరీలో 126వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 13,338వ ర్యాంకు సాధించాడు. ధూళికట్టలో గ్రామ కూడలి వద్ద బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష గురువారం తరుణ్‌ను సన్మానించారు.

✦ ప్రాథమిక పాఠశాల సందర్శన

రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం రామగుండం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం తానం స్వర్ణ సందర్శించారు. స్కూల్‌ను సందర్శించిన సమయంలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లారు. 30వరకు బడిబాట ఉన్న నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలపై స్పష్టత రానుందని తెలిపారు. 13న 'ఒక విద్యార్థి.. ఇద్దరు ఉపాధ్యాయులు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం మేరకు పాఠశాలను సందర్శించిన కాంప్లెక్స్ హెచ్ఎం, ఎమ్మార్పీ తదితరులు విద్యార్థుల చేరికలపై ప్రచారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. పాములపేట స్కూల్ విజిట్ విషయమై జిల్లా విద్యాధికారికి వివరించనున్నట్లు చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంథని: నిజాంల కాలంనుంచి నేటివరకు మంథనిలో విద్య విరాజిల్లుతున్న క్రమంలో 121 వసంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి యువత వ్యవస్థాపకుడు కొండేల మారుతి తెలిపారు. గురువారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో విద్యావసంతోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. వచ్చే దసరా- దీపావళి పండుగ వేళ వసంతోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారినుంచి నేటి నుంచి మూడు రోజులు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థి యువత కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. రామగుడు మారుతి, బాపు తదితరులు ఉన్నారు.

బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభం



సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నారాయణరావుపల్లిలో శ్రీభూలక్ష్మి-మహాలక్ష్మి సమేత బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యా యి. ఇందులో భాగంగా గురువారం దేవతలకు స ర్పంచ్ వెంకటలక్ష్మి జలాభిషేకం చేశారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ బస్టాండ్ వద్ద గురువారం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్ నుంచి రాజీవ్ రహదారిపైకి ఎక్కుతున్న క్రమంలో పెద్దపల్లి వైపునకు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన రామకృష్ణకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.